



# ఇక్కడ స్టీలు సామాన్లు కొనబడును

పాలపర్తి జ్యోతిష్మతి

"మేడమ్!" అని ఎవరో పిలవడంతో వరండాలో కూర్చుని పేపరు చదువుకుంటున్న సుబ్బారావు తలెత్తి చూశాడు. సుమారు ఇరవై ఏళ్ళ వయసుండే కుర్రాడొకడు చేతిలో సంచితో గేటు దగ్గర నిలబడి ఉన్నాడు.

"ఎవరు కావాలి? అడిగాడు సుబ్బారావు.

"మేడమ్‌ని పిలవండి సార్. పనుంది."

"లోపల పనిలో ఉంది. ఏం కావాలో నాతో చెప్పు."

"మీతో చెప్పేది కాదు సార్. మేడమ్‌ని పిలవండి. మాట్లాడాలి."

మాటల అలికిడి విని సుబ్బలక్ష్మి చేతులు కొంగుకు తుడుచుకుంటూ బయటికి వచ్చింది. "ఏంటి బాబూ? ఏం కావాలి?"

"గుడ్‌మార్నింగ్ మేడమ్! నేను ఏటుజడ్ హోమ్ ప్రొడక్ట్స్‌నించి వస్తున్నాను" అంటూ లోపలికొచ్చి సంచిలోంచి ఒక అట్టపెట్టె బయటికి తీశాడు.

"సేల్స్‌రిప్రజంటేటివ్‌వా? ఇప్పుడేమీ అక్కర్లేదయ్యా. అవన్నీ బయటికి తియ్యకు." అన్నాడు సుబ్బారావు.

"మీరు వద్దంటే ఎట్లా సార్! మేడమ్‌ని చూడనివ్వండి" అంటూ అట్టపెట్టె తెరచి దాంట్లోంచి గులాబిరంగు ప్లాస్టిక్ మూతలతో షడ్భుజి ఆకారంలో ఉన్న స్టీలుబౌల్సు సెట్ తీసి సుబ్బలక్ష్మి చేతికిచ్చాడు.

"మూడు బౌల్స్ సెట్ మేడమ్! కొత్తగా ఇంట్రొడ్యూస్ చేస్తున్నాం. కంపెనీ ప్రైస్ మూడువందలు. ఫిఫ్టీపర్సెంట్ డిస్కౌంట్ ఆఫర్ ఇస్తున్నాం. నూటయాభై రూపాయలకే వస్తుంది." అంటూ ఇంకో రెండు పెట్టెలు సంచిలోంచి తీసి కింద పెట్టాడు.

సుబ్బలక్ష్మి తన చేతిలోని గిన్నెల్ని అటూఇటూ తిప్పి పరీక్షిస్తోంది.

"ప్లాస్టిక్ మూతలు, పొరపాటున చెయ్యిజారి కింద పడితే పగిలిపోతాయి" అన్నాడు సుబ్బారావు.

"అన్‌బ్రేకబుల్ ప్లాస్టిక్ సార్. ఎంత ఎత్తు నుంచి పడ్డా పగలవు."

"నాలుగుసార్లు తోమితే గీతలు పడి అసహ్యంగా తయారవుతాయి."

"సార్ ఎక్స్‌పీరియన్స్ ఉన్నవారిలా మాట్లాడుతున్నారే!" ముసిముసిగా నవ్వుతూ అన్నాడు కుర్రాడు.

పళ్ళు పటపట కొరికాడు సుబ్బారావు. "ఇప్పుడు అవసరం లేదని చెప్పాను కదా? కావాల్సినప్పుడు కొనుక్కుంటాంలే. వెళ్ళు." కసురుకున్నాడు.

"మీకు కావాల్సినప్పుడు ఆఫర్‌ప్రైస్ ఉండదు సార్. ఇవాళా రేపే ఈ అవకాశం. అయినా మీరు వద్దంటే ఎట్లా సార్? మేడమ్ కొనాలనుకుంటున్నారు."

"రెండు సెట్లు తీసుకుంటాను. ఇచ్చే రేటు చెప్పు" అంది సుబ్బలక్ష్మి.

"ఇప్పుడు అంత డబ్బు పెట్టి అవి కొనడమెందుకే" చిరాగ్గా అన్నాడు సుబ్బారావు.

"వచ్చే నెల్లో మా మేనమామ తోడల్లుడి కొడుకు బావమరిది పెళ్ళి కదండీ? గివ్వ ఇవ్వడానికి బాగుంటాయి."

"ఎవరి పెళ్ళి?" అయోమయంగా అడిగాడు సుబ్బారావు.

"మా మేనమామ తోడల్లుడి..."

"ఆఁ! చాల్లే. చెప్పింది చాల్లే కాని ఆ పెళ్ళికి నువ్వెళ్ళడం అంత అవసరమా? అసలు వాళ్ళు నిన్ను పిలుస్తారా?"

"అదేంటండీ అట్లా అంటారు? పిలవకుండా ఎట్లా ఉంటారు? స్వయానా మా మేనమామ..."

"వద్దు, వద్దు. ఆ బంధుత్వాల చిట్టా ఇప్పుడు విప్పక్కర్లేదు. ఒకవేళ వాళ్ళు పిలిస్తే, నువ్వు వెళ్తే-అప్పటి సంగతి అప్పుడు చూసుకోవచ్చు కదా? ఇప్పటినుంచి ఇవన్నీ కొనిపెట్టుకోవాలా?"

"చూడండి ఎంత అందంగా ముద్దుగా ఉన్నాయో! అప్పటికప్పుడు ఇట్లాంటివి కావాలంటే దొరుకుతాయా? దొరికినప్పుడే కొని పెట్టుకోవాలి. అందులో తక్కువకి ఇస్తానంటున్నాడు కూడా."

అవును అన్నట్టు తలూపాడు కుర్రాడు.

"మీ మేనమామ తోడల్లుడి... ఆc! సరేలే! వాళ్ళెవరి పెళ్ళో అయితే ఇవ్వడానికొకటి. మరి రెండోదెందుకు?"

"భలేవారేనండీ మీరు. ఇంతగా నచ్చిన వస్తువు మనింట్లోకి ఒకటి కొనుక్కోమా?"

మళ్ళీ అవును అన్నట్టు ఆనందంగా తలూపాడు కుర్రాడు.

"ఎట్లా ఇస్తావో చెప్పు బాబూ" అడిగింది సుబ్బలక్ష్మి.

"చెప్పాను కదా మేడమ్! నూటయాభై. అసలు రేటులో సగమే కదా? ఇంకా తగ్గించడానికి కుదరదు. మా సొంతంగా మేం ఏ నిర్ణయాలూ తీసుకోకూడదు. కంపెనీవాళ్ళు ఎట్లా చెప్తే అట్లా. అంతే."

"అబ్బో! స్టీలు బొచ్చెలు అమ్ముకోవడానికి కూడా సొంత నిర్ణయాలు, కంపెనీవాళ్ళు చెప్పడాలు." అసహనంగా గొణుక్కున్నాడు సుబ్బారావు.

"వస్తానుండు" అంటూ లోపలికెళ్ళింది సుబ్బలక్ష్మి.

'నక్కను తొక్కొచ్చాను. భలే బేరం కుదిరింది.' ఉబ్బితబ్బిబ్బవుతున్నాడు కుర్రాడు.

'వెధవ, జిడ్డులా పట్టుకున్నాడు. పొద్దున్నే మూడొందలు క్షవరం.' ఉడికిపోతున్నాడు సుబ్బారావు.

సుబ్బలక్ష్మి లోపల్నించి పాతగుడ్డల మూట తీసుకొచ్చి కింద పడేసి వాటిపక్కనే కూర్చుంది. "ఇదిగో బాబూ! ఈ పాత బట్టలు తీసుకుని ఈ రెండూ ఇచ్చెయ్యి" అంటూ రెండు పెట్టెలు తీసి గడప లోపలికి పెట్టింది.

బిత్తరపోయాడు కుర్రాడు. అతి కష్టం మీద గొంతు పెగుల్చుకుని "మేడమ్! నేను పాతబట్టలకి స్టీలు సామాన్లు అమ్ముకొనేవాణ్ణి కాను. ఇవి కంపెనీ ప్రోడక్ట్స్. నేను కంపెనీ ఆథరైజ్డ్ సేల్స్ రిప్రజంటేటివ్‌ని" అన్నాడు. చొక్కా జేబుకు తగిలించుకున్న ఐడెంటీ కార్డు చూపిస్తూ.

"సరేలేవయ్యా! అందరూ ఏవో కబుర్లు చెప్తారు. కంపెనీ అయితే ఏంటి? ఇంకోటైతే ఏంటి? నువ్వు స్టీలు సామాన్లు అమ్ముకోడానికి వచ్చావు. నేను కొనుక్కోవాలనుకుంటున్నాను. నా దగ్గర డబ్బుల్లేవు. ఈ గుడ్డలు తీసుకొని ఇచ్చెయ్యి. నీ పనీ అవుతుంది, నా పనీ అవుతుంది."


'నిజంగానే వీడి పనైపోయింది' తన్నుకొస్తున్న నవ్వు బిగబట్టుకుంటూ అనుకున్నాడు సుబ్బారావు.

"అదికాదు మేడమ్! నేను చెప్పేది అర్థం చేసుకోండి."

"ఊరికే నస పెట్టకయ్యా. బట్టలు చూసుకో. అబ్బాయి గుడ్డలన్నీ కొత్తవే. బిగుతైపోయాయని తీసేశాడంతే. చీరలు కూడా కట్టీకట్టీ విసుగొచ్చి తీసేసినవే కానీ ఎక్కడా చిన్న చిరుగైనా లేదు. రెండు జరీ చీరలు కూడా ఉన్నాయి. కట్టుకోని బట్టలు ఊరికే ఇంట్లో అడ్డంగా ఎందుకని వేసేస్తున్నాను. ఈ రెండింటికి ఇన్ని బట్టలు ఎవరేస్తారు నీకు?"

నెమ్మదిగా చెయ్యి చాపి లోపల ఉన్న పెట్టెల్ని అందుకునే ప్రయత్నం చేస్తూ "నా వస్తువులు నాకిచ్చేయ్యండి మేడమ్. నేనెళతాను." ఏడుపు గొంతుతో అన్నాడు కుర్రాడు.

"ఏమిటయ్యా, మీదిమీది కొస్తున్నావు? అమ్ముకోడానికి వచ్చినవాడివి కొంటానంటుంటే వెళ్ళిపోతానంటావేంటి? ఉండు, ఇప్పుడే వస్తాను" అంటూ అట్టపెట్టెల్ని ఇంకాస్త లోపలికి నెట్టి, లేచి ఇంట్లోకెళ్ళింది.




"ఇదేంటి సార్... మేడమ్ ఏంటి..." గుటకలు మింగుతూ అన్నాడు కుర్రాడు.

కుర్చీ చేతిమీదికి మోకాలి మడత వచ్చేటట్లుగా వేసుకుని కూర్చుని వినోదం చూస్తున్న సుబ్బారావు "నేను ముందే చెప్పాను కదా 'అవన్నీ బయటికి తియ్యకు, వెళ్ళిపో' అని. 'మేడమ్‌ని పిలవండి, మేడమ్‌ని పిలవండి' అని పట్టు పట్టావు. నేను పిలవకుండా తనే వచ్చి నీ సరుకు కొంటానంటోంది. ఇప్పుడు ఆవిణ్ణి చూసి భయపడిపోతున్నావే!" అన్నాడు.

"మీరైనా ఆవిడకి అర్థమయ్యేట్టు చెప్పండి సార్." సుబ్బారావుని బ్రతిమాలుతూ అన్నాడు కుర్రాడు.

"సుబ్బలక్ష్మి! ఎవరు చెప్పినా వినదు" అన్నాడు సుబ్బారావు సినిమా ఫక్కీలో.

"ఇదుగో బాబూ! ఇంక బేరాలొద్దు. ఆ బట్టలతోబాటు ఈ ఐదు రూపాయలు తీసుకుని అవి రెండూ ఇచ్చేసి వెళ్ళు" అంది సుబ్బలక్ష్మి లోపల్నుంచి తెచ్చిన ఐదురూపాయల కాగితం కుర్రాడికిస్తూ. అతను నిస్సహాయంగా సుబ్బారావు వైపు చూశాడు.

"ఏం చేస్తావు? తప్పుతుందా! ఆ బట్టలమూట నెత్తిన పెట్టుకుని వెళ్ళు. ఎవరు చేసిన కర్మ వారనుభవించక తప్పదు."

"ఏంటండీ? ఇందాకణ్ణించీ చూస్తున్నాను. మీ ధోరణి మీదేకాని నేను చెప్పేది వినిపించుకోరేంటి? తమాషాగా ఉన్నట్టుందే మీకు. అవి రెండూ ఇటు పెట్టండి నా దారిన నేను వెళ్తాను. లేకపోతే దౌర్జన్యం చెయ్యాల్సొస్తుంది." సహనం చచ్చిపోయిన కుర్రాడు కోపంగా అరిచాడు.

ఇంతలో వీధిలో "పాతబట్టలకి స్టీలు సామాన్లు, జరీ చీరలకి స్టీలు సామాన్లు" అన్న కేక వినిపించింది. సుబ్బలక్ష్మి మెడ చాచి వీధిలోకి చూసి "నా పాతబట్టలకి స్టీలు సామాన్లు ఇచ్చే వాడొచ్చాడు. నీ వస్తువులు నువ్వే ఉంచుకో. బేరం నిలుపుకోవడం చాతకాదు. పైగా కోపమొకటి." అంటూ అట్టపెట్టెలు కుర్రాడివైపు నెట్టింది. గబగబా సంచి సర్దుకుని 'బ్రతుకుజీవుడా!' అనుకుంటూ బయటపడ్డాడు కుర్రాడు.